




## (గతసంచిక తరువాయి)

# 17. గోవులు గర్జించేదెప్పుడు?

ఆరోజుల్లో కొందరు రాజులు, మహారాజులు, ఊరుకుంటే ఊరా పేరా అని, వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకుని ఇరుపక్కల సైనికులని సరదాగా చంపుకుంటూ సామ్రాజ్య విస్తరణ దురదతో యుద్ధాలు చేసుకునేవారు. అప్పుడే వ్యాపారం చేసుకోవటం కోసం వచ్చారు బ్రిటిష్ తెల్లదొరలు. మన రాజులు, తరాజులు తమ కిరీటాలు సింహాసనం క్రింద భద్రంగా దాచుకుని, వాళ్ళని ఎందుకైనా పనికొస్తారులే అని తమ నెత్తి మీద అతిజాగ్రత్తగా పెట్టుకున్నారు. అది చూసి 'భలే చాన్సులే, ఇప్పుడు వ్యాపారం గ్యాపారం వద్దులే' అనుకుని, బ్రిటిష్ వారు అలవాటు ప్రకారం, ఒక రాజు మీద ఇంకో రాజుని ఉసిగొలిపే ఆట కూడా ఆడటం మొదలుపెట్టారు. ఈ ఆటల్లో బలవంతులు గెలవటం, బలహీనులు ఓడటం సహజం కదా. అందుకని బలహీన రాజులకి ఒక అండాదండా కావలసి వచ్చింది. దాని కోసం దండ పట్టుకుని తిరుగుతుంటే, బ్రిటిష్ వాడు తెల్లగా, బుర్రగా, టోపీతో, చంకలో తుపాకీతో కనపడ్డాడు.

'దొరికిన ఒక్క రొట్టెముక్కని రెండు పిల్లులు ఎలా భాగాలు చేయాలో తేల్చుకోలేక కోతిని సహాయం అడిగిన తెలుగు కథ' ఆ ఇంగ్లీషు వాడికి తెలుగు రాకపోయినా కూడా తెలుసుట. అందుకని, 'సరే ఎలాగూ నెత్తి మీద ఎక్కాం కదా ఇక దిగటం ఎందుకులే' అని వాడు మహారాజుల తల మీదనించీ క్రిందకి దిగలేదు. దిగకపోగా అక్కడే బాగుందని, వాళ్ళ తలపాగా మీద పాగా వేసి, చాప క్రింద నీరులా దేశమంతటా ఆక్రమించాడు. దానితో భారతదేశం రెండు వందల సంవత్సరాలు 'బ్రిటిష్ రాజ్' అయిపోయింది.

ఆ రెండు వందల సంవత్సరాల్లో సగటు భారతీయుడిని బానిసగా చేసుకుని, తమ కాలి క్రింద తొక్కి పెట్టుకున్నారు. వజ్రాలు, రత్నాలు, సుగంధాలు, బంగారంతో పాటు మన దేశ సంపదనంతటినీ దోచుకున్నారు. జనం చేత ఊడిగం చేయించుకున్నారు. అంతటితో ఆగలేదు. లేనిపోని శిస్తులు పెట్టి రైతులని అణగదొక్కారు. ఎదురు తిరిగిన ప్రజలని, ఎవరైనా సరే, నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు. ప్రార్థన చేసుకుంటున్న వేలమంది సిక్కు మతస్తులని

జలియన్వాలా బాగ్‌లో తలుపులు మూసి మరీ పిట్టల్ని కాల్చినట్టు కాల్చివేశారు. శాంతియుతంగా ఉప్పు సత్యాగ్రహం చేస్తున్న సాధారణ ప్రజానీకాన్ని తూటాలతో తుడిచిపెట్టేశారు. సైమన్ కమిషన్ చేస్తున్న అత్యాచారాలని ఖండించిన వారి జీవితాల్ని అక్కడికక్కడే అంతం చేసారు. తన అహింసా సిద్ధాంతాన్ని విడనాడని మహాత్ముడితో పాటు, స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న పటేల్, గోఖలే, తిలక్, అజాద్, ప్రకాశం, భోగరాజు, సరోజిని మొదలైన కార్యకర్తలతో సహా, మారు మూలల వున్న మామూలు మనుష్యుల దాకా జైళ్ళ పాలయారు.

అప్పుడే గోవులు గర్జించాయి!

బ్రిటిష్ వాడి వాడి తగ్గేదాకా ఆ గర్జన ఆగలేదు!

గత్యంతరంలేక రవి అస్తమించని సామ్రాజ్యం, తూర్పున ఇండియాలో శాశ్వతంగా అస్తమించింది.

భారతదేశం స్వతంత్ర భారతదేశం అయింది!

అందమైన మూడు రంగుల భారత పతాకం స్వేచ్ఛగా భారతదేశంలో తల ఎత్తుకుని రెపరెపలాడింది!!

ం ం ం

అంతకు ముందు కొన్ని వందల సంవత్సరాల క్రితమే ఇంగ్లండ్, యూరప్ దేశాలలోని తెల్లవారు ఆఫ్రికాలోని నల్లవారిని బానిసలుగా తెచ్చుకుని, వారు కూడా సాటి మనుష్యులేనని మరచిపోయి ఎంతో హింస పెట్టారు. చచ్చేంత చాకిరీ చేయించుకున్నారు. పని చేస్తూ, చేస్తూ అలసిన వారి వీపుల మీద కొరడా దెబ్బలు కురిపించారు. పిల్లా, పాప, ఆడా, మగ అని చూడకుండా కాదన్న వారిని కాల్చి చంపేశారు.

అప్పుడే కొలంబస్ అనే ఒక సముద్రపు దొంగ యూరప్ నించీ ఇండియాలోని బంగారాన్నీ, వజ్రాలనీ, సిల్కు వస్త్రాలనీ, సుగంధాలనీ దోచేయాలని, ఇండియా వున్న తూర్పు దిశ ఎటూ వుందో ఆ దశా దిశా తెలియక, దిక్కు తోచక పడమటి దిశగా వెళ్లి అప్పటికే కొన్ని వేల సంవత్సరాలనించీ అక్కడే వున్న అమెరికా దేశాన్ని తన కళ్ళతో మొదటిసారి చూసి కనుక్కున్నాడుట! దానితో తెల్లవాళ్ళ నివాసానికి అప్పనంగా ఇంకొక దేశమే కాదు, అమెరికా ఖండమే దొరికింది. అక్కడ ఎన్నో వేల సంవత్సరాలుగా వున్న స్థిర నివాసుల్ని అణగదొక్కి, అడ్డం వచ్చిన లక్షలమంది స్థిర నివాసుల్ని అడ్డంగా కోసేసి, మొత్తం అమెరికా ఖండాన్నే ఆక్రమించుకున్నారు బ్రిటిష్, స్పానిష్, పోర్చుగల్, జర్మన్, డచ్, ఫ్రెంచ్ తెల్లవారు. అంతేకాదు ఉత్తర అమెరికాలో ఎప్పటినించో వున్న స్థిర నివాసుల్ని, కొలంబస్ దయవల్ల, ఇండియన్స్ అని ఈనాటికీ పిలుస్తూనే వున్నారు.

ఆక్రమించుకున్నాక మరి అప్పనంగా కబ్జా చేసిన అన్ని కోట్ల ఎకరాల భూమిని సాగు చేయటానికీ, వారి సుఖాలకి తగ్గట్టు బానిసత్వం చేయటానికీ, ఆఫ్రికానించీ ఇంకా ఎన్నో లక్షలమంది నల్లవారిని తెచ్చుకున్నారు. వారి చేత ఎంత పని చేయించుకున్నా బానిసలు కనుక, వారిని మనసు వున్న మనుష్యులుగా చూడలేదు. ఆరోజుల్లోని ఒక్కొక్క నల్లవాడి వీపు మీద, ముఖం మీదా, శరీరమంతటా వున్న కొరడా దెబ్బలు సాక్షి. వారిని చెట్లకు తలక్రిందులుగా వేలాడదీసి, చితగ్గొట్టి ఆ

శవాలను రాబందులకు ఆహారంగా పెట్టటం సాక్షి. అంటరాని వారినిగా చేసి, ఆ నల్ల ఆడవారిని అంటుకుని తెల్ల దొరలు చేసిన ఎన్నో మానభంగాలు వాటికి సాక్షి.

అమెరికాలో స్థిర నివాసులని చేసిన ఊచకోత కథల, నల్లవారి బానిసత్వం కథల పుస్తకాలు చదివిన రోజున, వాటి ఆధారంగా తీసిన సినిమాలు చూసిన రోజున నాకు అసలు నిద్రపట్టదు. ఒళ్ళు ఉడికిపోతుంది. తెల్లవారు తినే చోట నల్లవారు తినకూడదు. తెల్లవారు ఎక్కే వాహనాలలో నల్లవారికి ప్రవేశం లేదు. ఉన్నా కేటాయించిన వెనక సీట్లలోనే కూర్చోవాలి. భారతదేశంలో మన భూస్వాములు నిర్మించిన మాల పల్లెలలాగా, అమెరికాలోనూ నల్లవారి నివాసాలు ఊరికి దూరంగా ఎక్కడో వుండేవి. ఇప్పటికీ పేద నల్లవారి ఇళ్ళు అంతే. అన్నిచోట్లా తెల్లవారి మరుగుదొడ్లు వేరు. అక్కడ నల్లవారికి ప్రవేశం లేదు. నల్లవారికే కాదు, అరవై ఏళ్ళ క్రితం దాకా భారతీయులతో సహా ఇతర శరీరపు రంగులవారికి ఎవరికీ ప్రవేశం లేదు.

శతాబ్దాల క్రితం క్రిస్పస్ అట్టుక్స్, గాబ్రియల్ ప్రాస్సర్, డెన్మార్క్ వెసీ, హారియట్ టబ్మన్, ఫ్రెడ్రిక్ డగ్లస్ మొదలైన నల్లవారు, హక్కుల సంగతి సరేసరి, తమని కనీసం సాటి మనుష్యులుగా చూడమని ఎంత పోరాడినా వారిని ఖాతరు చేయలేదు. వీరిలో కొంతమందిని చంపేశారు కూడాను. అబ్రహాం లింకన్ సివిల్ రైట్స్ న్యాయ సమ్మతం చేశాక, దక్షిణాది రాష్ట్రాలు ఏడు కన్ఫెడరేషన్ రాష్ట్రాలుగా మారి, నల్లవారిని ఇంకా ఎక్కువగా ఊచకోత కోయటం ప్రారంభించాయి. కేకేకే మొదలైన సంస్థలు శ్వేతజాతి ఆధిక్యతకి రక్షణ దళాలుగా మొలకెత్తాయి.

అమెరికాలో ఇలా జరుగుతుంటే దక్షిణాఫ్రికాలో తెల్లవారు నల్లవారి మీద సంఖ్యలో ఎంతో తక్కువయినా, వారిని కాలి క్రింద తొక్కిపట్టారు. మారణహోమం చేయసాగారు.

అప్పుడే అక్కడ గోవులు గర్జించాయి!

అమెరికాలో ఇ.డి.నిక్సన్, బుక్కర్ వాషింగ్టన్, క్లాడేట్ కోల్విన్, జాన్ కేనన్, రోసా పార్క్స్, డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ మొదలైన కార్యకర్తలు ముందుకు వచ్చి ఉద్యమం నడిపించారు. మహాత్మా గాంధీ నడిపించిన ఆహింసావాదమే మార్టిన్ లూథర్ కింగ్ పాటించిన మార్గం. ఆ 'శాంతి యుద్ధం'లో మార్టిన్ లూథర్ కింగ్‌తోసహా ఎందరో ప్రాణాలర్పించారు. ఈ మానవతా యజ్ఞంలోనే, వారికి అండగా నిలచిన రాబర్ట్ కెన్నెడీ, జాన్ కెన్నెడీ లాటి తెల్లవారు కూడా బలి అయిపోయారు.

దక్షిణాఫ్రికాలో నెల్సన్ మాండేలా, ఒల్వెడా ఎక్విన్, డెస్మండ్ టుటు మొదలైన వారి నాయకత్వంలో మానవత్వం కోసం మరో శాంతియుత యజ్ఞం మొదలయింది. అక్కడా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు.

అక్కడ కూడా గోవుల గర్జన ఆగలేదు!

అమెరికాలో ప్రెసిడెంట్ జాన్సన్ నల్లవారికి సమాన హక్కులు ఇస్తూ కాగితం మీద సంతకం పెట్టే దాకా గోవులు గర్జిస్తూనే వున్నాయి!

దక్షిణ ఆఫ్రికాలో నల్లవారికి పార్లమెంటులోనూ, సమాజంలోనూ సమాన స్థానం వచ్చేదాకా ఆ గర్జన ఆగలేదు! అక్కడ ముఖ్య పాత్ర వహించిన వారిలో ఒకరు ఈలా గాంధీ. మహాత్మా గాంధీగారి మనుమరాలు!

○ ○ ○

ఆనాడు కన్యాశుల్కం నాటకంలో గురజాడవారు ‘తాంబూలాలిచ్చాం, తన్నుకు చావండి’ అని చెప్పినట్టు, బ్రిటిష్ వాడు వెడుతూ వెడుతూ, ‘స్వరాజ్యం ఇచ్చాం. ఇక కొట్టుకు చావండి’ అని వెళ్ళిపోయాడు.

ఏదో మన రెండు వందల సంవత్సరాల బాసుగాడు చెప్పాడు, వినకపోతే బాగుండదని ‘అలాగే సార్!’ అన్నాం. “Divide and Rule” అనే ఇచ్చిన మాట తప్పని హరిశ్చంద్రులం కనుక ఎనభై ఏళ్ళనించీ మనలో మనమే ఇదనీ, అదనీ అర్థంలేని చెత్తతో కొట్టుకు చస్తున్నాం. కలివిడిగా వుండాల్సిన మనం విడిపోతున్నాం.

కుల కురుక్షేత్రం యధాశక్తి కొనసాగిస్తున్నాం. కొనసాగించటమే కాదు, అదే ప్రాణవాయువుగా పీలుస్తూ ఆ మరణంలోనే జీవిస్తున్నాం. మతాల మారణహోమం ఏమాత్రం ఆగకుండా జాగ్రత్త పడుతున్నాం.

రాజకీయాలని బాగా కుళ్ళబెట్టి ఆ రొచ్చుగుంట దుర్గంధాన్ని ఆనందంగా పీలుస్తూ శ్వాసకోశాల్లో బంధిస్తున్నాం. లంచాలు, కల్తీలు, బంధుప్రీతి, అస్మదీయుల అభిమాన సంఘాలు, తస్మదీయుల దురభిమాన దౌర్జన్యాలు ఎక్కువయిపోయాయి. బాధ్యతల్ని పూర్తిగా మరచిపోయి హక్కుల కోసం పోట్లాడుతున్నాం. మనిషికీ మనిషికీ మధ్య గీతలు గీసుకుని విడిపోతున్నాం. స్త్రీలని బలహీనుల్ని చేసి అణగద్రొక్కటం, రోడ్ల మీదే రేప్ చేయటం, కులాల పేరుతో కోటాలు పెట్టి సమర్ధతని వెనక్కి నెట్టటం, మన చదువులని విజ్ఞానం కోసం కాక బజార్లో అమ్మకానికి పెట్టటం ఎక్కువయింది. దౌర్జన్యం, రౌడీయిజం, పట్టపగలే రోడ్డు మీద హత్యలు, మానభంగాలతో శాంతియుత సహజీవన సమాజానికి వలువలు విప్పి, విలువలు లేకుండా చేస్తున్నాం. ప్రభుత్వాలే ఎక్కడపడితే అక్కడ లాభాల కోసం పీపాలతో మద్యం అమ్ముతూ, నోట్లతో ఓట్లు కొనుక్కుంటున్నారు. సెక్సూ, దౌర్జన్యం, హింసాకాండల సినిమాలతో రక్తసిందూరం పెట్టి, యువతని తప్పుదారి పట్టిస్తున్నాం. నిర్వీర్యం చేస్తున్నాం.

ప్రపంచంలోనే ఎక్కువ జనాభాగల దేశం కదా మనది. కొన్ని లక్షల రాజకీయ దుర్యోధనులు మాత్రమే చేస్తున్న ఇన్ని అక్రమాలను చూస్తూ, నూట నలభై కోట్ల పైన వున్న జనం మరి ఏం చేస్తున్నారు?

శ్రీశ్రీగారు ఒకసారి అన్నారు, సముద్రంలో స్నానం చేద్దామని వెళ్ళాడుట ఒక పెద్ద మనిషి. అక్కడే అలాగే ఒడ్డున నుంచుని వున్నాడుట కానీ, ఎన్ని రోజులయినా సముద్రంలో దిగడు. అదేమిటయ్యా అంటే సముద్రంలో అలలు వున్నాయి, అవి తగ్గాక స్నానం చేస్తానన్నాడుట. సముద్రంలో అలలు తగ్గటం అంటూ వుండదు. అది అలల లక్షణం. అలాగే వున్నారు మన ప్రజలు అన్నారు ఏనాడో శ్రీశ్రీ. అప్పటినించీ ఇప్పటి దాకా అది ఏమాత్రం మారలేదంటే ఆశ్చర్యంగా వుంటుంది.

‘సంభవామి యుగే యుగే!’ అని కృష్ణ భగవానుడి ఉవాచ.

మరి ఈ యుగంలో దిగి వచ్చే ఆ 'హీరో' కోసం తలుపు చాటున నుంచుని, మన జనం ఇంకా ఎదురు చూస్తున్నారేమో!

'If you want to see a change, you be the change' అన్నారు మహాత్మా గాంధీ.

'గాంధీగారా? ఆయనెవరు? సోనియా గాంధీ నాన్నగారా?' అనే స్థితిలో వుంది మన యువత!

'ఏ బృహత్కార్యమైనా ఒక్కడితోనే మొదలవుతుంది' అని చరిత్ర చెబుతోంది.

భలేవాళ్ళే! మనం చరిత్ర పుస్తకాలు చదవం కదా!

చరిత్ర పుస్తకాలే కాదు, ఏ పుస్తకాలు చదవాలన్నా తెలుగు రాదు కదా!

ఏ భాషైనా అసలు పుస్తకాలు చదివే అలవాటే లేదు కదా!

అయితే మరి, మళ్ళీ గోవులు గర్జించేదెప్పుడు?

○ ○ ○

మేము నాలుగున్నర దశాబ్దాల క్రితం అమెరికాకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఇక్కడ సమాజంలో చాల మార్పులు వచ్చాయి. ఆరోజుల్లో అమెరికాలో ఎక్కువమంది భారతీయులు వుండేవారు కాదు. తెలుగువారే తక్కువ. ఏ భారతీయ భాష వినపడ్డా వెనక్కి తిరిగి, వారితో పరిచయం చేసుకునే వాళ్ళం. ఇండియానించీ వచ్చిన ఇంజనీర్లంటే మంచి ఉద్యోగులు అనే గట్టి నమ్మకం ఎక్కువగా వుండేది. ఆరోజుల్లో మాకు ఉద్యోగాలు తొందరగా వచ్చేవి. మా ఇళ్ళ దగ్గర కూడా పక్కింటి అమెరికా పిన్నిగారితోనూ, ఎదురింటి ఎడ్వర్డ్ గారితోనూ బాగా కలిసిపోయేవాళ్ళం.

కొన్ని చోట్ల, ముఖ్యంగా మా టెక్సస్‌లాటి దక్షిణ రాష్ట్రాల్లో జాతి వివక్ష వుండేది కానీ, పైకి అంతగా కనపడేది కాదు. మన పిల్లలకి స్కూల్లో మంచి పేరు వుండేది. మేము ఊహించుకున్న అమెరికా, అప్పుడున్న అమెరికా ఒకేలా వుండటంతో జీవితం హాయిగా వుండేది.

దరిమిలా పరిస్థితులు మారిపోయాయి. ఇండియాకి స్వతంత్రం తెప్పించి, దేశంలో స్వేఛ్ఛావాయువులు తెప్పించిన కాంగ్రెస్ పార్టీ ఎలా భ్రష్టు పట్టి దేశ వినాశనానికి కారణం అయిందో, అదేవిధంగా అమెరికా దేశాన్ని చక్కటి రాజ్యాంగంతో గొప్పగా ముందుకు తీసుకువెళ్ళిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ అంతకన్నా ఘోరంగా భ్రష్టు పట్టింది.

ఇప్పుడు అమెరికా ఒక శతాబ్దం వెనక్కి వెళ్ళింది. ఇప్పుడిది మేము ఆనాడు వచ్చిన అమెరికా కానేకాదు.

రెండు వందల నలభై సంవత్సరాల అమెరికా చరిత్రలో, తెల్లవాళ్ళు తప్పితే నల్లవాళ్ళు ఏ పెద్ద పదవులకి రాని దేశంలో, మొట్టమొదటిసారిగా ఒక నల్లవ్యక్తి అధ్యక్షుడు అవటం కొంతమంది శ్వేత జాతీయాహంకారులకి నచ్చలేదు. ప్రతి విషయంలోనూ ఏమీ చేయనీయకుండా యధాశక్తి ఆయనకి బహిరంగంగానే అడ్డం పడ్డారు. అయినా ఆయన ఎదురీది, పూర్తిగా దిగజారిపోయిన ఆర్ధిక పరిస్థితిని మెరుగు చేయటం, వైద్యం అందుబాటులో లేని మిలియన్ల సామాన్య ప్రజానీకానికి మొట్టమొదటిసారిగా మెడికల్ ఇన్స్యూరెన్స్ ఇవ్వటం, నిరుద్యోగాన్ని తగ్గించి ఎంతోమందికి ఉపాధి

కల్పించటం, ప్రపంచ దేశాలతో స్నేహంగా వుంటూ సమస్యలు పరిష్కారం చేసి అనవసరంగా యుద్ధాలకి కాలు దువ్వకపోవటం, మిగతా దేశాల వద్ద అమెరికా గౌరవాన్ని పెంచటంలాటి ఎన్నో మంచి పనులు చేసి, అమెరికా చరిత్రలోనే గొప్ప ప్రెసిడెంట్ అయాడు. దానితో ఆ జాత్యహంకారులు అసూయతో తట్టుకోలేకపోయారు. అమెరికాలో తెల్లవారిలోని అధిక సంఖ్యాకుల గురించి నేను చెప్పటం లేదు. వారు నిర్మించిన స్నేహపూరిత వాతావరణం వల్లనే, మనందరం ఈనాడు అమెరికాలో వుంటున్నాం. జాత్యహంకారుల సంఖ్య తక్కువే అయినా, మనందరికీ తెలుసు ఒక గ్లాసెడు పాలలో, ఒక్క చుక్క విషం కలిపితే ఏమవుతుందో. అప్పుడు అదే జరిగింది. ఇప్పుడూ జరుగుతున్నది.

నల్లవారు, మెక్సికన్లు, ముస్లిములు, ఎన్నో ఇతర దేశాలవారు, అమెరికా కోసం రకరకాల యుద్ధాలలో పాల్గొన్న అమెరికన్ పౌరులంటే ఏమాత్రం గౌరవం లేని ఒక నియంత పదవిలోకి వచ్చాడు. ఎక్కువ మంది ప్రజలు ఓట్లు వేయకపోయినా, రాజ్యాంగంలో వున్న కొన్ని వెసులుబాటు లోపాలని ఆశ్రయించి అధ్యక్షుడు అయాడు. ఒకసారి కాదు. రెండుసార్లు. దానికి డేవిడ్ డూక్ లాటి కేకేకే సంస్థ నాయకుల సహాయం ఎంతో వుంది. ఇదేమీ రహస్యం కాదు. ఎన్నోచోట్ల సభల్లో, వాళ్ళు అధ్యక్షుడి పక్కనే నిలబడి ప్రచారం చేశారు. అంతేకాదు ఆయన పదవిలోకి వచ్చాక కేకేకే వాళ్ళు, నియో నాజ్జి వాళ్ళ అల్లర్లను, రాజధాని మీద చేసిన ఉగ్రవాదాన్ని ఖండిచకపోగా, వారిని సమర్ధించి, వంద సంవత్సరాల క్రితం వివక్షతల అమెరికా ఎలావుండేదో చవిచూపించాడు.

ఈనాడు అమెరికాలో చాలామంది తెలుపు, తెలుపు కాని ఇతరుల మధ్య దూరం విపరీతంగా పెరిగింది. బ్రిటిష్‌వారి 'విభజించి పాలించు' సూత్రాన్ని అక్షరాలా పాటిస్తున్నాడు. నల్లవారిని, మెక్సికన్లని, ముస్లిములని, కొందరు భారతీయులని ఏమీ కారణం లేకుండా అరెస్ట్ చేయటం, వారి నిత్య జీవితంలో భద్రత లేకుండా చేయటం చూస్తున్నాం. బీదవారికి మెడికల్ ఇన్స్యూరెన్స్ లేకుండా చేయటానికి గట్టి ప్రయత్నాలే జరుగుతున్నాయి. ఎన్నాళ్ళ క్రితమో సరైన వలస పేపర్లు లేకుండా వచ్చి, అమెరికాలో స్థిరపడిన వారిని వెనక్కి పంపించేస్తున్నారు. ఉద్యోగాల్లో అవసరమైన ఇమ్మిగ్రంట్సుని రాకుండా చేస్తున్నారు.

మరి ఎన్నాళ్ళుంటుందో ఈ ముసళ్ళ పండగ. మళ్ళీ ఇంకొక రోసా పార్క్స్, మార్టిన్ లూథర్ కింగ్ అవసరమవుతారా?

గోవులు మళ్ళీ గర్జిస్తాయా? అలా అయితే, మరి గోవులు మళ్ళీ గర్జించేదెప్పుడు?

○ ○ ○

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS